క్లుప్తంగా

జిలుగు విత్తనాల పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ ఆగ్రో రైతుసేవ కేంద్రంలో ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన జిలుగు విత్తనాలను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. 30 కేజీల జిలుగు విత్తనాల బస్తా 75శాతం సబ్సిడీపై రూ.1126లకు పంపిణీ చేశారు. ఆగ్రో రైతు సేవ కేంద్రానికి 7 టన్నుల జిలుగు విత్తనాలు రావడంతో రైతులు అధికసంఖ్యలో తరలివచ్చి విత్తనాలు తీసుకెళ్లారు. కొంతమంది రైతులకు జిలుగు విత్తనాలు అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

భూకబ్జాలను అడ్డుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జాలను అడ్డుకోవాలని కౌన్సిలర్ గోపాలమ్మ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రాత్రికి రాత్రి ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను రక్షించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

నారాయణఖేడ్: మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఈ నెల 18 నుంచి శని, ఆదివారాల్లో ఎల్లమ్మతల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికోత్సవంలో భాగంగా శనివారం స్వస్తి పుణ్యాహవచనం, మహాగణపతి పూజ, నవగ్రహ మండపారాధన, ఆవాహిత దేవతారాధన, ఎల్లమ్మతల్లికి హోమం, 108 కలశాలతో అష్టోత్తర ఘటాభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, రాజోపచారసేవ, ఆశీర్వచనం, తీర్థప్రసాదాల వితరణ, ఆదివారం రేణుకఎల్లమ్మ, జమదగ్ని మహర్షి కల్యాణ మహోత్సవం, తీర్థప్రసాదాల వితరణ నిర్వహించనున్నట్లు వివరించారు.

యువకుడు అదృశ్యం



జిన్నారం(పటాన్‌చెరు): యువకుడు అదృశ్యమైన సంఘటన గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాహుల్ మోరియా (29) బొంతపల్లిలో 10ఏళ్లుగా తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న మోరియా ఈ నెల 6వ తేదీన తిరుపతికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇప్పటివరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, స్నేహితుల వద్ద మోరియా కోసం వెతికినా సమాచారం లభించలేదు. రాహుల్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా భూలక్ష్మమ్మ వార్షికోత్సవాలు

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని దుదగొండ గ్రామంలో భూలక్ష్మమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, నర్సింహాగౌడ్, చందుపాటిల్, నాగభూషణం, నరేశ్‌స్వామి, రాజ్‌కుమార్, శివకాంత్, మల్లేష్ యాదవ్, గుండుగొండ, సుభాష్, రాంగోపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రామాగౌడ్, అంజయ్య, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా సినిమా థియేటర్ బంద్



పటాన్‌చెరులో మూసివేసిన ఎస్వీ స్కేర్ సినిమా థియేటర్

పటాన్‌చెరు: సినిమా థేయేటర్ల అసోసియేషన్ పిలుపు మేరకు పటాన్‌చెరు డివిజన్‌లోని ఎస్వీ స్కేర్ సినిమా థియేటర్ యాజమాన్యం స్వచ్ఛందంగా బంద్ చేసింది. ఒకటే స్క్రీన్ సినిమా థియేటర్లకు ప్రేక్షకులు రావడంలేదని, ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని ఆయా సినిమా థియేటర్ల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటీటీ, కార్పొరేట్ మల్టీప్లెక్స్‌లు వచ్చిన తర్వాత చిన్న థియేటర్లను మూసివేసుకునే పరిస్థితి ఏర్పడిందని, ప్రేక్షకులు రాకపోవడంతో కనీసం కరెంట్ బిల్లులు కూడా చెల్లించడం ఇబ్బందిగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు. జూన్ 1వ తేదీ వరకు ఎస్వీ స్కేర్ సినిమా థియేటర్‌ను బంద్ చేయనున్నట్లు యాజమాన్యం తెలిపింది.

యువతకు ఉపాధి | భవితకు పునాది

- టైలరింగ్, బ్యూటీపార్లర్, మగ్గం వర్క్, మెకానిక్ తదితర విభాగాల్లో ఉచిత శిక్షణ
- ఎస్‌బీఐ సౌజన్యంతో వ్యాపార రుణాలు
- నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ

సంగారెడ్డిలోని గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. ఈ సంస్థ 2010లో జూన్ 7న ఏర్పాటు కాగా నాటి నుంచి ఎస్‌బీఐ సౌజన్యంతో యువతీ, యువకులకు ఉపాధి పొందే అనేక రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. శిక్షణతో పాటు ఉచితంగా భోజనం, వసతి కల్పించడమే కాకుండా వ్యాపార రుణాలను సైతం మంజూరు చేస్తూ తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న నిరుద్యోగ యువతకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ అండగా నిలుస్తూ ఉపాధి కల్పిస్తోంది.

– సంగారెడ్డి టౌన్



మెకానిక్‌లో శిక్షణ పొందుతున్న యువకులు

సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత గత 14 ఏళ్లుగా మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్, మగ్గంవర్క్ కంప్యూటర్ శిక్షణ అందిస్తుండగా పురుషులకు మోటార్ వెహికల్ మెకానిక్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సీసీ టీవీ, ఫోటోగ్రఫీ, కెమెరా ఇన్స్టాలేషన్ శిక్షణతో పాటు ఉచితంగా వసతి, భోజనం సదుపాయం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం సర్టిపికెట్లు అందజేస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన ట్రైనింగ్ సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుండటంతో గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ తీసుకునేందుకు తరలివస్తున్నారు.

2010 జూన్ 7న ప్రారంభం

2010 జూన్ 7వ తేదీన ప్రారంభమైన ఈ శిక్షణ సంస్థ ద్వారా ఇప్పటివరకు 7111 మహిళలు, 3503 మంది పురుషులు శిక్షణ తీసుకోగా 8214 మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. 2899 మందికి బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి. శిక్షణలో భాగంగా వ్యక్తిత్వ వికాసం వ్యాపార సంబంధ బ్యాంకింగ్ విషయాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు.

ఎంబ్రాయిడర్ షాపు నిర్వహిస్తున్నా



గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ అందించిన శిక్షణ ద్వారా రూ.4లక్షలతో ఎంబ్రాయిడర్ షాప్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాను. ఎస్‌బీఐలో రూ.2లక్షల లోన్ తీసుకొని మరో 2లక్షలు మా కుటుంబ సభ్యుల సహకారంతో సమకూర్చుకున్నాను. నెలకు సుమారుగా రూ.40,000వేల వరకు ఆదాయం వస్తోంది.

– భాగ్యమ్మ, కోనంపేట గ్రామం, హత్నూర మండలం

హౌస్‌వైరింగ్‌లో శిక్షణ పొందుతున్నా



మాది సంగారెడ్డి జిల్లా.. నారాయణఖేడ్ మండలం.. చప్త గ్రామం. మాది నిరుపేద కుటుంబం. గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ద్వారా హౌస్‌వైరింగ్‌లో శిక్షణ పొందుతున్నాను. శిక్షణ అనంతరం మంచిగా ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా ఉంటాను. శిక్షణా సంస్థలో అన్ని వసతులు బాగున్నాయి.

– అనిల్, చప్తా గ్రామం, నారాయణఖేడ్ మండలం

మెకానిక్ షాప్‌తో ఉపాధి కల్పిస్తా



మెదక్ జిల్లా నుంచి వచ్చి మోటార్ వెహికల్‌లో శిక్షణ పొందుతున్నాను. శిక్షణ సంస్థ ఉచితంగా హాస్టల్ వసతి, భోజన సదుపాయం కల్పిస్తోంది. శిక్షణలో వ్యక్తిత్వ వికాసం, వ్యాపారాలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. శిక్షణ అనంతరం సొంతగా మెకానిక్ షాప్ పెట్టుకొని నాతో పాటు నలుగురికి ఉపాధి కల్పిస్తాను. – రాకేష్, ఎల్లాపూర్ గ్రామం, నర్సాపూర్ మండలం

బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నా



న్యూస్ పేపర్‌లో వచ్చిన ఉచిత శిక్షణ ప్రకటనను చూసి సంగారెడ్డి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయానికి సంప్రదించాను. ఆ తర్వాత ఉచితంగా హాస్టల్‌లో ఉంటూ బ్యూటీషియన్‌లో శిక్షణ పొందాను. డ్వాక్రా గ్రూప్ ద్వారా రూ.2లక్షలతో బ్యూటీపార్లర్ షాపును పెట్టుకొని నెలకు రూ.20 వేల నుంచి 35వేల వరకు సంపాదిస్తున్నాను.

– ఉజ్వల, శంకరంపేట గ్రామం, మెదక్ జిల్లా

10614 మంది శిక్షణ పొందారు



గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు బ్యాంకు ద్వారా రుణాలను కల్పిస్తున్నాం. ఇప్పటివరకు వివిధ వృత్తుల్లో 8214 మంది లబ్ధి పొందారు. ఉచిత వసతితో పాటు వ్యాపారాలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.

– రాజేంద్రప్రసాద్, గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ డైరెక్టర్

విధుల్లో అధికారులు నిమగ్నం



రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి

జహీరాబాద్: నెల రోజుల పాటు పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు ఎన్నికలు ముగియడంతో ప్రస్తుతం విధుల్లో బీజీ బీజీ అయ్యారు. శుక్రవారం జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి పెండింగ్ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి పరిష్కారం నిమిత్తం సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో తాగునీటి సదుపాయం, శానిటేషన్, రహదారుల ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. ఎక్కడైనా అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారా అనే విషయాలపై ఆరా తీశారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. తహశీల్దార్ రవీందర్ సైతం రెవెన్యూ పనులను పరిశీలించారు. పాత కోర్టు వ్యవహారాలకు సంబంధించి పాత రికార్డులను పరిశీలించి తగిన సమాచారం సేకరించారు.

అఖండ హరినామ సప్తహా ముగింపు



బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

నారాయణఖేడ్: మండల పరిధిలోని తుర్కాపల్లి గ్రామంలో అఖండ హరినామ సప్తహా ముగింపును శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 1వ తేదీన హనుమాన్ ఆలయంలో ప్రారంభమైన సప్తహాను శుక్రవారంతో ముగింపు చేపట్టారు. నిత్యం భజనలు, కీర్తనలతో గ్రామస్తులు సప్తహాలో పాల్గొన్నారు. ముగింపు పురస్కరించుకొని హనుమాన్ ఆలయం నుంచి గ్రామ శివారులో ఉన్న మహాలక్ష్మి, శివుడి ఆలయం వరకు మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా ప్రతి ఏడాది సప్తహాను వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 19 నుంచి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

కరాటేలో శశాంక్‌సింగ్ ప్రతిభ



శశాంక్‌సింగ్‌తో పాటు ఆయన తండ్రిని సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

సంగారెడ్డి టౌన్: ఇటీవల మలేషియాలో నిర్వహించిన కరాటే పోటీల్లో తెలుగు కుర్రోడు శశాంక్‌సింగ్ అదరగొట్టాడు. సంగారెడ్డి మండల పరిధిలోని కలబ్‌గుర్ గ్రామానికి చెందిన శశాంక్ సంగారెడ్డిలోని లిటిల్ బర్డ్స్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. మలేషియాలో 3రోజుల పాటు నిర్వహించిన కరాటే విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా శశాంక్‌సింగ్‌తో పాటు ఆయన తండ్రిని గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. గ్రామం పేరును మలేషియా వరకు తీసుకెళ్లినా శశాంక్‌సింగ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసిఫ్, చక్రపాణి, ఆనంద్, అజయ్, అమ్‌జద్, మున్నా, వాజిద్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న కల్యాణం



మల్లన్నకు పూజలు చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని మల్లన్న మందిరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మల్లన్న కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లకేరీ నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా బోనాల ఊరేగింపును నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 18 నుంచి 23 వరకు సిద్దాపూర్ కాలనీలోని మల్లన్న, బీరప్ప, కామరతి జాతర నిర్వహించనున్నట్లు గొల్ల, కురుమ యాదవ సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు, గొల్ల, కురుమ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మహాపూర్ణాహుతి

మండల పరిధిలోని గోమారంలో ఈ నెల 12న ప్రారంభమైన చతుర్వేత హవనం ఉత్సవాలు మహాపూర్ణాహుతితో శుక్రవారం ఘనంగా ముగిశాయి. లోక కల్యాణం కాంక్షించి వేదమాత అనుగ్రహంతో చతుర్వేత హవనం.. పాలకుర్తి సుధాకర్ గౌతమ్‌శర్మ పర్యవేక్షణలో వేలేటి సిద్ధరామేశ్వరశర్మ ద్వివేది వైదిక నిర్వహణలో ప్రత్యేక పూజ మహోత్సవాలు నిర్వహించారు. చివరి రోజున ప్రాత: కాల పూజలు, చతుర్వేత హవనం, జయాదులు, బలిహరణం, కలశోద్వాసన, మహాదాశీర్వచనం.. మహా పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– శివ్వంపేట(నర్సాపూర్)



చాముండేశ్వరీ మాత



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

అకాల వర్షం.. చెరకు పంటకు జీవం



పచ్చగా కనిపిస్తున్న చెరకు పంట

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: వారం రోజుల నుంచి ఆడపాదడపా కురుస్తున్న వర్షాలు జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతులకు ఊరటనిస్తున్నాయి. ఈ సంవత్సరం ఉష్ణోగ్రత్తలు పెరగడంతో ప్రజలు అల్లాడిపోయారు. భూగర్భజలాలు కూడా పడిపోయి పంటలు ఎండుముఖం పట్టాయి. వ్యవసాయ డివిజన్‌లో ప్రస్తుతం చెరకు పంట అధిక విస్తీర్ణంలో సాగువుతోంది. సుమారు 20 వేల ఎకరాల్లో పంట ఉండగా కరెంట్ కోత, భూగర్భజాలాలు తగ్గడంతో నీరందక పంటలు ఎండసాగాయి. ఎర్ర నేలలు ఉన్న ప్రాంతంలో పంట రంగు మారుతోంది. ఊహించని విధంగా ఒక్కసారి రెండు మూడు భారీ వర్షాలు కురడంతో చెరకు పంటకు జీవం పోశాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం చల్లబడడంతో పాటు నేల తడిగా మారి ఎండుముఖం పట్టిన చెరకు పంటలు ప్రస్తుతం పచ్చగా కనిస్తున్నాయి. జహీరాబాద్ టౌన్, న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో వారం రోజులుగా మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షానికి కొన్ని గ్రామాల్లో వాగులు ప్రవహించాయి. వర్షాలతో చెరకు పంటకు మేలు జరిగిందని వ్యవసాయ అధికారిణి ప్రవీణ పేర్కొన్నారు.

మారిన వాతావరణం

అకాల వర్షాల కారణంగా నియోజకవర్గంలో ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. రెండు మూడు నెలల నుంచి ఎండలతో అల్లాడిపోతున్న జనాలకు కాస్త ఉపశమనం కలిగింది. నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొనడంతో ఉష్ణోగ్రతలు చాలావరకు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈదురు గాలుల కారణంగా మామిడి పంటకు కొంత నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

కొనసాగుతున్న జాతర

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో ఏడు వారాల జాతర వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం భక్తులు ఆయా గ్రామాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పరామర్శ

నారాయణఖేడ్: మండల పరిధిలోని అబ్బెందకు చెందిన భీమ్‌శెట్టి(72) కొద్ది రోజుల కిందట ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కాంగ్రెస్ నాయకులు వీర్‌శెట్టి గ్రామానికి వెళ్లి భీమ్‌శెట్టి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కుమ్మరి సత్యం ఎద్దు గ్రామ శివారులోని రోడ్డుకు పక్కన మేత మేయడానికి వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు సత్యం వేడుకున్నారు. ఈ మేరకు పశుసంవర్ధక, విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఉపాధి పనులు కల్పించండి**

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని కల్హేర్ ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఉపాధిహామీ పనులు చేసేందుకు కూలీల హాజరుశాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **త్వరలోనే బొల్లారం మున్సిపాలిటీ విలీనం**

జిన్నారం(పటాన్‌చెరు): గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో బొల్లారం మున్సిపాలిటీ త్వరలో విలీనం కానుందని, దీంతో బొల్లారం మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో బొల్లారం విలీనం కానుందని అని తెలిపారు. విలీన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

◆ **గుండెపోటుతో లక్ష్మణ్‌రావు మృతి**



నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన హరిభక్త పారాయణులు లక్ష్మణ్‌రావు (75) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. లక్ష్మణ్‌రావు నారాయణఖేడ్‌లో ఉంటూ అఖండ హరినామ సప్తాహా కార్యక్రమాలతో పాటు మరాఠా సాంప్రదాయ వార్కారీ, భజన, కీర్తన, ప్రవచనాలు చేస్తుండేవారు. లక్ష్మణ్‌రావు మృతి పట్ల భక్తులు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలను సాయంత్రం ఖేడ్‌లో నిర్వహించారు.

◆ **జొన్నల కొనుగోలులో నిర్లక్ష్యం తగదు**

కల్హేర్(నారాయణఖేడ్): జొన్నలను కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కాంగ్రెస్ మండల నాయకుడు దేవదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్హేర్, మార్డి, కృష్ణాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా మార్క్‌ఫెడ్, ఐకేపీ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కల్హేర్, మార్డి, కృష్ణాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

◆ **బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 27 వరకు జరగనున్నాయి. తొలిరోజు విష్వక్సేన పూజ, పుణ్య వచనం, కంకణ దారణం, పుట్ట బంగారం, అగ్ని ప్రతిష్ఠ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. శనివారం హోమం, బలిహారం, ధ్వజారోహణం, స్వామివారి తిరు కల్యాణం, ఊరేగింపు జరగుతుందని ఆలయ పూజారి గోపాలకృష్ణశర్మ తెలిపారు.

◆ **దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి**

వెల్దుర్తి(తూప్రాన్): రైతులు అమ్ముకునే దొడ్డు రకం వడ్ల కూడా రూ.500లు బోనస్ చెల్లించాలని జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. తన చాంబర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం హామీలను అమలు చేస్తానని ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ధాన్యానికి క్వింటాలుకు రూ. 500ల బోనస్ చెల్లిస్తామని ప్రకటించిందన్నారు. ఇప్పుడు కేవలం సన్న రకం వడ్లకేనని ముఖ్యమంత్రి మాట్లాడటం రైతాంగాన్ని మోసం చేయడమేనన్నారు. బేషరతుగా దొడ్డు రకానికి కూడా కాంగ్రెస్ రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మురళి, అశోక్‌గౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

◆ **రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

శివ్వంపేట(నర్సాపూర్): బైక్‌ను ఆటో ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఉసిరికపల్లి తండాకు చెందిన పాత్లోత్ శ్రీనివాస్ బైక్‌పై కొత్తపేటకు వెళ్తున్నాడు. కాగా అతడి వాహనాన్ని ఆటో ఢీ కొట్టగా గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా ఇక్కడికి చేరుకొన్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది.

◆ **రఘునందన్ గెలుపుపై ధీమా**

కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వానికి జై కొట్టబోతున్నారన్నారు. అబ్‌కీ బార్ చార్‌సౌ పార్ నినాదంతో ప్రజలు ఏకీభవిస్తున్నారన్నారు. మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రానుందని, మోదీ మూడోసారి కూడా పీఎం కానున్నారని చెప్పారు. పార్టీ మండలాధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి కుమార్, రాజుపాల్గొన్నారు.